నేటి నుంచి తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మహాసభ

- ముస్తాబైన మిర్యాలగూడ
- నేడు మహాప్రదర్శన, బహిరంగ సభ
- హాజరు కానున్న బృందాకరత్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభకు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ వేదికైంది. బుధవారం ప్రారంభం కానున్న ఈ మహాసభ ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఉద్యమాల గడ్డగా పేరొందిన మిర్యాలగూడలో తొలిసారిగా గిరిజన సంఘం మహాసభ జరుగుతుండటం ప్రాధాన్యత సంతరించుకుంది. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యధికంగా గిరిజనులు ఉండటం మిర్యాలగూడ కేంద్రంగా మహాసభ జరగడం అత్యంత ప్రాధాన్యత నెలకొంది. మార్చి 1, 2, 3 తేదీల్లో ఈ మహాసభ జరగనుంది. మొదటి రోజు బుధవారం ఉదయం పది గంటలకు మిర్యాలగూడ పట్టణంలోని హనుమాన్‌పేట ఫ్లైఓవర్ బ్రిడ్జి నుంచి ఎన్ఎస్‌పి క్యాంపు మైదానం వరకు మహా ప్రదర్శన నిర్వహించనున్నారు. సుమారు 2000 మంది గిరిజన సంస్కృతి సంప్రదాయ దుస్తులతో కవాతులో పాల్గొంటారు.

మధ్యాహ్నం రెండు గంటలకు ఎన్ఎస్‌పి క్యాంపు మైదానంలో బహిరంగ సభ జరగనుంది. ఈ సభకు మాజీ ఎంపి, ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ నాయకులు బృందాకరత్, మాజీ ఎంపి, ఆదివాసీ అధికార రాష్ట్రీయ మంచ్ చైర్మెన్ మీడియం బాబురావు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు హాజరుకానున్నారు. సాయంత్రం స్థానిక ఎఆర్‌సి ఫంక్షన్‌హాల్‌లో ప్రతినిధుల మహాసభ ప్రారంభమవుతుంది. రెండు, మూడు తేదీల్లో ప్రతినిధుల సభ కొనసాగుతుంది. ఇందులో సుమారు వెయ్యి మంది పాల్గొననున్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న గిరిజన వ్యతిరేక విధానాలపై చర్చించి, భవిష్యత్ ఉద్యమాల కార్యాచరణ రూపొందించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి

మిర్యాలగూడ పట్టణంలోని నలుమూలల్లో పచ్చని తోరణాలు, ఫ్లెక్సీలు, బ్యానర్లు, గోడరాతలతో అలంకరించారు. ప్రధాన కూడల్లో పెద్దపెద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. పట్టణ ముఖద్వారంలో తోరణాలతో అలంకరించారు. సాగర్ రోడ్డు వెంబడి డివైడర్ల పోల్స్‌పై గిరిజన జెండాలను కట్టారు. స్థానిక ఎన్ఎస్‌పి కాపు మైదానంలో బహిరంగ సభ కోసం ప్రత్యేక షామియాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి సభకు వచ్చే వాహనలను ఫ్లైఓవర్ బిడ్జి వరకు వెళ్లేందుకు అణువుగా ఏర్పాట్లు చేశారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

ఏర్పాట్లను పరిశీలించిన జూలకంటి రంగారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మిర్యాలగూడలోని ఎన్ఎస్‌పి క్యాంపులో బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు జరిగే గిరిజన సంఘం మహాసభ బహిరంగ సభను జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. మంగళవారం బహిరంగ సభాస్థలాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మార్చి ఒకటి నుంచి మూడ్రోజులపాటు మిర్యాలగూడలో తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర మూడో మహాసభ జరనుందని చెప్పారు. అందులో భాగంగా ఒకటో తేదీన మహా ప్రదర్శన, బహిరంగ సభ ఉంటుందన్నారు. జిల్లా నలుమూలలతోపాటు ఇతర జిల్లాల నుంచి గిరిజనులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఆయన వెంట తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీరామ్‌నాయక్, జిల్లా అధ్యక్షులు మూడావత్ రవినాయక్, బాబునాయక్, నాగేశ్వర్ నాయక్ తదితరులు ఉన్నారు.

ప్రీతిది ఆత్మహత్య కాదు... హత్యే

- కాంగ్రెస్ నేత బెల్లయ్యనాయక్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డాక్టర్ ప్రీతిది ఆత్మహత్య కాదని, హత్యేననీ పిసిసి సీనియర్ అధికార ప్రతినిధి బెల్లయ్యనాయక్, ఎస్‌సి సెల్ విభాగం చైర్మెన్ ప్రీతం అనుమానం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో మహిళలపై దాడులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం బాధితుల పక్షాన నిలవడం లేదని విమర్శించారు. నేరగాళ్లను రక్షించే ప్రయత్నం చేస్తున్నదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో సోమవారం వారు విలేకర్లతో మాట్లాడారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత ఎస్‌సి, ఎస్‌టి, బిసిలపై దాడులు, అత్యాచారాలు పెరిగాయని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికో విద్యార్థి ప్రీతి నాయక్ వేధింపులపై ఫిర్యాదు చేసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోలేదన్నారు. అవి భరించలేక ఆమె చనిపోయిందని తెలిపారు. జ్యూడీషియల్ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రీతి మృతికి మతం రంగు పులిమే ప్రయత్నం చేయడం సరైందికాదని చెప్పారు.

వేతన సవరణ కోసం కెటిపిపి ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలోని కెటిపిపి ఉద్యోగులు వేతన సవరణ-2022 కోసం చేస్తున్న ఆందోళన మంగళవారమూ కొనసాగింది. వారి నిరసన ఐదో రోజుకు చేరుకుంది. కెటిపిపి ఉద్యోగులు, కార్మికులు, ఇంజినీర్లు, ఆర్టీజన్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కెటిపిపి జెఎసి నాయకులు మాట్లాడుతూ.. ఉద్యోగులకు వేతన సవరణ-2022 వెంటనే అమలు చేయాలని, లేదంటే వేతన సవరణ, పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం తెలంగాణ స్టేట్ పవర్ జెఎసి ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

నల్లమలలో అదుపులోకొచ్చిన మంటలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లమల అటవీ ప్రాంతంలో చెలరేగిన మంటలు అదుపులోకి వచ్చాయి. సిబ్బంది సకాలంలో మంటలను ఆర్పడంతో పెను ప్రమాదం తప్పిందని మద్దిమడుగు, దోమలపెంట ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ ఆదిత్య తెలిపారు. నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ డివిజన్ పరిధిలో మంగళవారం ఒక్కరోజే సుమారు 15 ప్రాంతాలలో అగ్ని ప్రమాదాలు సంభవించాయని తెలిపారు. అక్క మహాదేవి బిలమ్, వటవర్లపల్లి బీట్ పరిధి, ఈగల పెంట సెక్షన్ మరియు న్యూ రోడ్ ఫర్హాబాద్ సౌత్ బీట్ , తుర్కపల్లి సెక్షన్ అమ్రాబాద్ రేంజ్‌లో, బోరెటి బావి మన్ననూర్ రేంజ్ పరిధిలో పంటలు చెలరేగడంతో గుర్తించారు. అటవీ సిబ్బంది, 70 మంది ఫారెస్ట్ ఫైర్ వాచర్స్, ఫైర్ టీమ్స్ క్విక్ రెస్పాన్స్ బృందాలు సకాలంలో అక్కడికి చేరుకొని ఉదయం నుంచి ఫైరింజన్లతో మంటలన ఆర్పేశారు.

మనువాదాన్ని ఐక్యంగా ప్రతిఘటించాలి

- మోడీ సర్కార్‌ను ఆపే శక్తి ప్రజలకే ఉంది
- 2024లో మళ్లీ గెలిస్తే సిఎఎ అమలు
- రాజ్యాంగంపై బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడి
- ప్రజాస్వామ్యం, లౌకికతత్వం, సామాజిక న్యాయం, ఫెడరలిజాన్ని కాపాడుదాం
- సెమినార్‌లో సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ పిలుపు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మోడీ సర్కార్ బుల్డోజర్‌ను ఆపే శక్తి ప్రజలకే ఉందని సిపిఎం పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ అన్నారు. 2024లో మళ్లీ బిజెపి గెలిస్తే పౌరసత్వ సవరణ చట్టం (సిఎఎ) అమల్లోకి వస్తుందని హెచ్చరించారు. రాజ్యాంగ హక్కులపై కేంద్ర ప్రభుత్వంతోపాటు బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని విమర్శించారు. దేశాన్ని, రాజ్యాంగ హక్కులను కాపాడుకోవాల్సిన బాధ్యత దేశ ప్రజలందరిపైనా ఉందని చెప్పారు. ప్రజాస్వామ్యాన్ని, లౌకికత్వాన్ని, సామాజిక న్యాయాన్ని, ఫెడరలిజాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాద్‌లోని హుస్సేని ఆలంలో 'రాజ్యాంగ హక్కులు-సవాళ్లు'అనే అంశంపై సెమినార్‌ను నిర్వహించారు. ఈ సదస్సులో బృందాకరత్ మాట్లాడుతూ బ్రిటీష్ రాజ్యం పోయిందనీ, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏండ్లయ్యిందనీ చెప్పారు. ఇప్పుడు రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఏం వచ్చిందని ప్రశ్నించారు. విదేశీ శక్తులు రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేయడంలేదని, స్వదేశీ శక్తులైన కేంద్ర ప్రభుత్వంతోపాటు బిజెపి, ఆర్ఎస్ఎస్ దాడి చేస్తున్నాయని విమర్శించారు. రాజ్యాంగాన్ని రక్షించేందుకు దేశ ప్రజలంతా అండగా ఉంటున్నారని తెలిపారు. బిజెపి అధికారంలోకి వచ్చాక రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేసి మనుస్మృతిని అమలు చేసేందుకు ప్రయత్నిస్తున్నదని విమర్శించారు. దేశంలోని వనరులను కార్పొరేట్లకు కట్టబెట్టేందుకు రాజ్యాంగంలో కొన్ని నిబంధనలు అడ్డుగా ఉన్నాయని తెలిపారు. అందుకే రాజ్యాంగంపై బిజెపి దాడి చేస్తోందన్నారు. సిఎఎకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా పెద్దఎత్తున ఉద్యమం సాగిందన్నారు. ఢిల్లీలో షాహీన్‌బాగ్‌తోపాటు హైదరాబాద్‌లోనూ ఉద్యమించారని గుర్తు చేశారు. ఇది ముస్లింలపైనే కాకుండా దేశంపైనా, ప్రజలపైనా జరిగిన దాడి అన్నారు. 2024లో బిజెపి మళ్లీ గెలిస్తే సిఎఎను అమల్లోకి తెస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. హిందూత్వ రాష్ట్రం ఏర్పాటు చేయడమే బిజెపి, ఆర్ఎస్ఎస్ లక్ష్యమని వ్యాఖ్యానించారు. హర్యానా ప్రభుత్వం గోరక్షక దళాల పేరుతో భజరంగ్‌దళ్ వారికి లైసెన్స్‌లు ఇచ్చిందని అన్నారు. ఇద్దరు ముస్లిం యువకులను బతికుండగానే కాల్చిచంపారని తెలిపారు. ఆర్ఎస్ఎస్ స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనలేదనీ, సమరయోధుల్లేరనీ, ఎవరూ జైలుకు వెళ్లలేదనీ అన్నారు. ప్రశ్నించే వారిని అణచివేసేందుకు ఉపా చట్టాన్ని తెచ్చిందన్నారు. ఎనిమిదేండ్లలో ఆ చట్టం కింద అరెస్టు చేసిన వారికి బెయిల్ ఇవ్వడం లేదని చెప్పారు. 10,500 మందిని అరెస్టు చేస్తే, వారిలో 200 మందికే శిక్ష పడిందని గుర్తు చేశారు. దేశంలో అధిక ధరలతో ప్రజలపై భారాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల కొనుగోలు శక్తి తగ్గుతున్నదని అన్నారు. అదానీ రోజుకు రూ.1,216 కోట్లు సంపాదిస్తున్నారని తెలిపారు. కార్పొరేట్లకు మోడీ ప్రభుత్వం దోచిపెడుతున్నదని చెప్పారు. ఈ బడ్జెట్‌లో ఆశాలు, అంగన్‌వాడీలు, మధ్యాహ్న భోజన కార్మికుల కోసం సరిపోయినన్ని నిధులు కేటాయించలేదని విమర్శించారు. మోడీ పాలనలో ఒక శాతం సంపన్నుల వద్ద 40 శాతం సంపద కేంద్రీకృతమై ఉందన్నారు. మోడీ ప్రభుత్వ మతతత్వ, కార్పొరేట్ అనుకూల విధానాలతో ముందుకు సాగుతున్నదని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆ విధానాలను తిప్పికొట్టేందుకు, దేశాన్ని కాపాడుకునేందుకు, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రజలంతా ఐక్యంగా పోరాడాలని ఆమె పిలుపునిచ్చారు.

ఎన్నికల్లో బిజెపి, ఎంఐఎంను ఓడించడమే లక్ష్యమని సదస్సుకు అధ్యక్షత వహించిన సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శి ఎండి అబ్బాస్ పిలుపునిచ్చారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 17 నుంచి హన్మకొండలో సిపిఎం జాతాను ప్రారంభిస్తుందని చెప్పారు. డబుల్ బెడ్రూం ఇండ్లు, సొంత జాగా ఉన్నోళ్లకు ఆర్థిక సాయం, పోడు భూములకు పట్టాలు వంటి సమస్యలను పరిష్కరించాలంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరతామన్నారు. పాతబస్తీలో ఎంఐఎం ఎంపీ, ఎమ్మెల్యేలున్నా అభివృద్ధి ఎందుకు జరగడం లేదని ప్రశ్నించారు. స్వచ్ఛమైన తాగునీరు లేదనీ, ప్రభుత్వ బడులు, ఆస్పత్రుల్లో సౌకర్యాల్లేవని విమర్శించారు. సమస్యల పరిష్కారం కోసం ఉద్యమించే సిపిఎంను ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆశాలత, సిపిఎం హైదరాబాద్ సౌత్ కమిటీ కార్యదర్శివర్గ సభ్యులు విఠల్, కోటయ్య, మీనా, పి నాగేశ్వర్‌రావు, అబ్దుల్ సత్తార్, సామాజిక కార్యకర్తలు ఇక్బాల్ జావీద్, నయాముల్లా షరీఫ్, సీనియర్ అడ్వకేట్ అబ్దుల్ ఖుద్దూస్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజురీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి

పెరుగుతున్న ధరలకనుగుణంగా స్కాలర్‌షిప్ పెంచాలి : ఎస్ఎఫ్ఐ డిమాండ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయి వెంటనే విడుదల చేయాలని, మెస్, కాస్మోటిక్స్ చారిరీలను రూ.1500 నుంచి రూ. మూడు వేలకు పెంచాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదలోని ఎస్ఎఫ్ఐ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా రూ.3,500 కోట్లు ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ పెండింగ్‌లో ఉండటం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. వారి విద్యాసంవత్సరం పూర్తై చాలాకాలం అవుతున్నా రీయింబర్స్‌మెంట్ విడుదల కాకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారని చెప్పారు. విద్యార్థులు కళాశాలల్లో సర్టిఫికెట్లు అడిగితే ఫీజురీయింబర్స్‌మెంట్ విడుదల కాలేదని, ఫీజు మొత్తాన్ని చెల్లించి సర్టిఫికెట్లు తీసుకుపోవాలని యాజమాన్యాలు చెబుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల డబ్బుల్లేక తమ సర్టిఫికెట్లను తీసుకోలేని స్థితిలో ఉన్నారన్నారు. దాంతో ఎస్‌సి, ఎస్‌టి, బిసి మైనార్టీ విద్యార్థులు ఉన్నత విద్యకు దూరమవుతున్నారన్నారు. ప్రభుత్వం తక్షణమే పెండింగ్‌లో ఉన్న ఫీజురీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

పేదరిక నిర్మూలనకు బడ్జెట్‌లో నిధులేవీ..

- అంగవైకల్యానికి పేదరికమే కారణం
- తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పేదరికమే అంగవైకల్యానికి ప్రధాన కారణమని.. పేదరిక నిర్మూలనకు బడ్జెట్‌లో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు నిధులు కేటాయించడం లేదని తెలంగాణ ప్రజాసంఘాల పోరాట వేదిక రాష్ట్ర కన్వీనర్ వీరయ్య ప్రశ్నించారు. హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం వికలాంగుల హక్కుల జాతీయ వేదిక ఆవిర్భావ దినోత్సవ వారోత్సవాల సందర్భంగా 'కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్ - వివిధ రంగాలపై ప్రభావం' అంశంపై రాష్ట్ర స్థాయి సదస్సును రాష్ట్ర అధ్యక్షులు కె వెంకట్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ.. వికలాంగుల సంక్షేమం పట్ల పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. ప్రజల కొనుగోలు శక్తి పెరుగుదలకు ఎలాంటి

సెమినార్‌లో మాట్లాడుతున్న వీరయ్య

చర్యలూ తీసుకోవడం లేదని, పైగా పన్నుల భారం మోపుతున్నారన్నారు. నిరుద్యోగం రోజురోజుకూ పెరుగుతున్నా బడ్జెట్‌లో నిధులు మాత్రం కేటాయించలేదన్నారు. ప్రజల ఆదాయం పెంచేందుకు కనీస వేతనాలు పెంచాలని కోరారు. అదానీ, అంబానీల ఆదాయం పెంచడమే ప్రధాని లక్ష్యంగా పెట్టుకున్నారని.. తద్వారా పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలు పెంచారని విమర్శించారు. పేదలు వినియోగించే రైల్వేలను ప్రయివేటీకరణ చేసే యత్నం చేస్తున్నారన్నారు. ఉపాధి హామీ చట్టానికి నిధులు తగ్గించారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా ఎంత మంది వికలాంగులకు ఇళ్లు కట్టించారో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలన్నారు. మానసిక వికలాంగుల సంక్షేమం కోసం, పునరావాస చట్టం అమలు కోసం ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదన్నారు.

ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి అడివయ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వికలాంగుల సంక్షేమం కోసం నిధుల కేటాయింపులో నిర్లక్ష్యం చేసిందని తెలిపారు పెన్షన్ పెంపు కోసం బడ్జెట్‌లో ఎందుకు నిధులు కేటాయించలేదని ప్రశ్నించారు స్వయం ఉపాధి రుణాలు, వివాహ ప్రోత్సాహకం పరికరాల పంపిణీ కోసం బడ్జెట్‌లో నిధులు కేటాయించలేదన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేష్, ఉపాధ్యక్షులు జయరాజు, దశరథ్, సహాయ కార్యదర్శి వి.ఉపేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు సురుపంగ ప్రకాష్, బొల్లెపల్లి స్వామి, రంగారెడ్డి, భుజంగారెడ్డి, రాములు, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.


రైతును సత్కరిస్తున్న శ్వేత

రికార్డు ధర పలికిన ఎర్ర బంగారం

- క్వింటా రూ.21,625
- దేశంలోనే ఇదే అత్యధిక ధర
- రైతును సన్మానించిన మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌లో ఎర్ర బంగారానికి రికార్డ్ స్థాయిలో ధర పలికింది. ఖమ్మం జిల్లా వైరా మండలం పినపాక గ్రామానికి చెందిన రైత ఎం రాంబాబు మంగళవారం ఖమ్మం వ్యవసాయం మార్కెట్‌కు కొత్త తేజ రకం మిర్చిని 34 బస్తాలు తీసుకొచ్చారు. మొత్తం 40వేల మిర్చి బస్తాలు వచ్చింది. అందులో రాంబాబుకు చెందిన 34 బస్తాల మిర్చిని పాకాల ఉమామహేశ్వరరావు కమీషన్ మార్చంట్ నుంచి వాసవి ట్రేడింగ్ కంపెనీకి చెందిన ప్రొప్రైటర్ సుందరరావు జెండా పాటగా క్వింటా రూ.21,625 పెట్టి కొనుగోలు చేశారు. ఈ ధర భారతదేశంలోనే అత్యధిక రికార్డ్ ధర అని వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత, ఉన్నత శ్రేణి కార్యదర్శి రుద్రాక్షి మల్లేశం తెలిపారు. సోమవారం ఇదే మార్కెట్‌లో కొత్త తేజ రకం మిర్చి క్వింటా రూ.20,200 పలకగా, ఒక్క రోజు వ్యవధిలోనే రూ.1425 పెరగడంతో రైతు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నాణ్యమైన పంటను మార్కెట్‌కు తీసుకొచ్చిన రైతు రాంబాబును వ్యవసాయ మార్కెట్ చైర్‌పర్సన్ దోరేపల్లి శ్వేత స్వీట్ తినిపించి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దోరేపల్లి శ్వేత మాట్లాడుతూ.. ఐదు జిల్లాల రైతులకు ఆదెరువుగా ఉన్న ఖమ్మం మార్కెట్‌లో మంచి ధర రావడం సంతోషంగా ఉందన్నారు. రైతులు నాణ్యమైన పంటలు దిగుబడి చేయడం ద్వారానే రికార్డు స్థాయి ధరలు పలుకుతున్నాయన్నారు. ఖమ్మం రైతుల పంటకు భారతదేశంలోనే రికార్డు స్థాయిలో ధర రావడం ఆనందంగా ఉందన్నారు. మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ సహకారంతో మరికొద్ది రోజుల్లోనే మార్కెట్‌లో మరిన్ని మౌలిక వసతులు కల్పిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ గ్రేడ్ టు అధికారి, అసిస్టెంట్ సెక్రటరీ నిర్మల, మిర్చిశాఖ అధ్యక్షుడు మాటేటి నాగేశ్వరరావు, కార్యదర్శి సతీష్, దిగుమతి శాఖ అధ్యక్షులు దిరిశాల వెంకటేశ్వర్లు, ఛాంబర్ ఆఫ్ కామర్స్ వైస్ ప్రెసిడెంట్ నరేష్ పాల్గొన్నారు.

కేరళకు రండి...

- పర్యాటకులకు ఆహ్వానం

ప్రజాశక్తి -హైదరాబాద్‌బ్యూరో

ప్రకృతి అందాల సుందర ప్రాంతం కేరళలో ఆతిథ్యం స్వీకరించేందుకు పర్యాటకులు పెద్ద సంఖ్యలో తమ రాష్ట్రానికి రావాలని ఆ రాష్ట్ర పర్యాటక శాఖ విజ్ఞప్తి చేసింది. కేరళలోని అకుపచ్చని అందాలు, సెలయేర్లు, సుందర సుమనోహర ప్రకృతి దృశ్యాలు, అద్భుతమైన వసతి, బోటింగ్, హిల్ స్టేషన్లు సహా భూతల స్వర్గం ఇక్కడ నెలవైఉందని పేర్కొన్నారు. తమ రాష్ట్రంలో ప్రస్తుతం ప్రీ వెడ్డింగ్ షూటింగ్స్ పెద్ద సంఖ్యలో జరుగుతున్నాయనీ, యువతీ యువకులు తమ జ్ఞాపకాలను తమ రాష్ట్రంతో పంచుకోవాలని ఆకాంక్షిస్తూ, ఆహ్వానిస్తున్నారు. సముద్రం, ఆకాశాన్నంటే కొబ్బరి చెట్లు, ప్రశాంతమైన బ్యాక్ వాటర్ అలలు, సహజమైన స్వచ్ఛమైన గాలి, విశాలమైన తేయాకు తోటలు, ఆధ్యాత్మిక శోభకూ నెలవైన కేరళలో పర్యాటకరంగ అభివృద్ధిని తాము కాంక్షిస్తున్నామని తెలిపారు. మంగళవారంనాడిక్కడి ఓ హోటల్‌లో కేరళ పర్యాటక శాఖ ఆధ్వర్యంలో బిజినెస్ టు బిజినెస్ (బీ టూ బీ) కార్యక్రమం జరిగింది. ఆ రాష్ట్ర సమాచారశాఖ విభాగాధిపతి సజేష్ కేరళ విశిష్టత, విహార స్థలాలు, ఆధ్యాత్మిక, ఆరోగ్య కేంద్రాల గురించి వివరించారు. ప్రకృతి ప్రేమికులకు తమ రాష్ట్రం సాదరంగా ఆహ్వానిస్తుందని అన్నారు. పర్యాటకులు కోరుకున్నట్టు వసతి, రవాణా, భోజనం సహా అన్ని సౌకర్యాలతో రకరకాల పర్యాటక ప్యాకేజీలను అందిస్తున్నామన్నారు. ఏటా దేశవ్యాప్తంగా ఈ తరహా బీ టూ బీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామనీ, త్వరలో బెంగుళూరులో కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వెల్లడించారు. కేరళ రాష్ట్రం గ్లోబల్ వెడ్డింగ్ డెస్టినేషన్ కేంద్రంగా, నూతన జంటల హనీమూన్‌ను అనువైన ప్రాంతంగా ఉంటుందని చెప్పారు. అంతకుముందు ప్రదర్శించిన కేరళ సంప్రదాయ నృత్యాలు, యుద్ధ కళలు ఆహూతులను ఆకర్షించాయి.

ప్రగతిభవన్ ముట్టడికి మహిళా కాంగ్రెస్ యత్నం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మహిళలపై దాడులు, లైంగిక వేధింపులకు నిరసనగా మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నాయకులు మంగళవారం ప్రగతిభవన్ ముట్టడికి యత్నించారు. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతా రావుతోపాటు 30 మంది మహిళా కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేసి, గోషామహల్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సునీతారావు మాట్లాడుతూ రాష్ట్రంలో రోజు రోజుకు పెరిగిపోతున్న నేరాలను నియంత్రించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళలకు ఏ మాత్రం రక్షణ లేదన్నారు. రోజు రోజుకు మహిళలపై అఘాయిత్యాలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆగస్టు 29,30 తేదీల్లో గ్రూప్-2

- టిఎస్‌పిఎస్సి వెల్లడి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రూప్-2 రాతపరీక్షల తేదీలను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్సి) ఖరారు చేసింది. ఆగస్టు 29,30 తేదీల్లో గ్రూప్-2 పరీక్షలను నిర్వహిస్తున్నట్టు టిఎస్‌పిఎస్సి కార్యదర్శి అనితా రామచంద్రన్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్ష నిర్వహణకు వారం రోజుల ముందు నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకునేందుకు అవకాశముంటుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న టిఎస్‌పిఎస్‌సి ప్రకటించిన గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 దరఖాస్తులొచ్చాయని అధికారులు వివరించారు. అంటే ఒక్కో పోస్టుకు 705 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. గ్రూప్-1 మెయిన్స్ రాతపరీక్షలు జూన్ ఐదు నుంచి జరుగుతాయి. జులై ఒకటో తేదీన గ్రూప్-4 పరీక్షలుంటాయి. గ్రూప్-3 రాతపరీక్షల తేదీలను త్వరలోనే ప్రకటించే అవకాశముంది. ఇతర వివరాలకు https://www.tspsc.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని అధికారులు సూచించారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

- విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించాలి :కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుతామని, ఇచ్చిన మాట ప్రకారం విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్నామని ఐటి, పురపాలక శాఖ మంత్రి కెటిఆర్ అన్నారు. మన ఊరు-మన బడి కార్యక్రమం కింద రాజన్నసిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో కేజీ టూ పీజీ క్యాంపస్‌ను ప్రారంభించామన్నారు. రాబోయే రోజుల్లో 26 వేల ప్రభుత్వ పాఠశాలలను అద్భుతంగా తీర్చిదిద్ది ఇంగ్లీష్ మీడియంలో బోధన అందిస్తామని చెప్పారు. ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా 2 వేల మంది ఇంటర్ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి కెటిఆర్ మాట్లాడుతూ.. పరీక్షలు దగ్గర పడుతున్నందున రాబోయే మూడు నెలలు బాగా చదువుకొని ఐఐటి, నీట్ ఎంట్రెన్స్‌ల్లో మంచి ర్యాంకులు సాధించాలని సూచించారు. వేములవాడ నియోజకవర్గానికి కూడా 3 వేల ట్యాబ్‌లు అందిస్తామన్నారు. గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల ముఖాల్లో చిరునవ్వులు చూడాలని ఆకాష్ బై జూస్ సాఫ్ట్‌వేర్ ట్యాబ్‌లు అందజేస్తున్నామన్నారు. ఈ ట్యాబ్‌ల ద్వారా పోటీ పరీక్షలకు ఉపయోగపడే మెటీరియల్‌ను కూడా అందజేస్తున్నట్టు తెలిపారు.

మహారాజశ్రీ కొత్తపేట సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.A. No. 18/2022
E.P.S.R. No. 628/2016 in
O.S. No. 3/1979

Between:
భావన శేషగిరిరావు వగైరాలు -పిటీషనర్లు
మరియు
R-8: శ్రీమతి చీమలపాటి లక్ష్మి కామేశ్వరి, W/o. సూర్యనారాయణ, Rajeswari Manson, D.No. 6-3-595/26 to 29/103, Padmavathi Nagar, Khairatabad - 500004. -8వ రెస్పాండెంటు

పై నెంబరు పిటీషనులో 8వ రెస్పాండెంటు అయిన మీకు ఎన్నిసార్లు కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ ఇంటిలోనే ఉంటూ ఉద్దేశ్యపూర్వకంగా నోటీసులు తీసుకొనకుండా కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు పేపరు ప్రకటన మీకు నోటీసులు అమలు నిమిత్తం ఆర్డరు వేసి **ది. 23-3-2023వ సం॥** తేదీకి వాయిదా వేసినారు. కావున వాయిదా రోజున మీరు స్వయంగా గాని, వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై ఆక్షేపణలు యున్న యెడల తెలియజేసుకొనవలెను. అలా కాని యెడల మీ పరోక్షమందు తీర్మానించెదరని యిందుమూలముగా తెలియపర్చడమైనది.

V.KAMESWARA RAO
Khairatabad పిటీషనరు తరపు అడ్వకేట్
23-02-2023 Razole, Cell: 9849100051

IN THE COURT OF THE MACT CUM II ADDL. CHIEF JUDGE CITY CIVIL COURT, AT :: HYDERABAD
O.P.No.824 OF 2022
BETWEEN :
Nukala Vamsi Krishna. ...Petitioner.
AND
Sai Renuka and others. ...Respondents.
To,
1. M/s Sai Renuka Enterprises rep. by G.Phileman Reddy, Owner of Goods Carriage HMV (Tipepr Lorry) No.TS 08 UF 6363, R/o. Sy.No.233, Bahadurpally village, Quthbullapur Mandal, Medchal District.
3.Banala Srikanth Reddy, S/o. Banala Pratap Reddy, aged major, Occ: Driver of Tipper Lorry No. TS 08 UF 6363, R/o. B.N.Thimmapuram, Bhongir, Yadadri.
...Respondent Nos.1 and 3.
Please take notice that the Petitioner has filed the above O.P. for compensation for the injuries sustained by the petitioner in a road accident caused by Your Tipper Lorry No.TS-08-UF-6363 on 30.3.2022 at about 7.30 AM. The said O.P. is posted to 28.03.2023 at 10.30 AM for your appearance and counter. Kindly make it convenient to be present on the said date before this Hon'ble Court by 10.30 AM in person or through your counsels. Otherwise the matter will be decided in your absence.
Hence this notice.
BY ORDER OF THE COURT
M. VIJAY REDDY
ADVOCATE
2-2-647/A/58, Saibabanagar, Shivam Road, Bagh Amberpet, Hyderabad Ph: 7673904549

ఆకలి మంటల పోరాటం

- కాళ్లు కడిగినట్టు ఫొటోలు దిగితే సరిపోదు • పారిశుధ్య కార్మికుల పొట్టలు నింపే చర్యలు తీసుకోండి • జిపి కార్మికులపై ఎందుకింత వివక్ష
- అరకొర జీతాలతో ఎట్లా బతకాలో కేంద్ర, రాష్ట్ర పాలకులే చెప్పాలి : ఎం సాయిబాబు
- జిపి కార్మికులు జీతాలు పంచుకోవాలనటం దుర్మార్గం : చుక్కరాములు • మల్టీపర్పస్ విధానం రద్దు చేయాలి : పాలడుగు భాస్కర్
- వేలాది మంది పంచాయతీ కార్మికులతో ప్రదర్శన, బహిరంగ సభ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ కార్మికులు చేస్తోంది ఆకలి పోరాటం అని సిఐటియు జాతీయ కోశాధికారి ఎం సాయిబాబు అన్నారు. ఇది అంతం కాదు..ఆరంభం మాత్రమే అని కేంద్ర, రాష్ట్ర పాలకులకు హెచ్చరికలు పంపారు. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ (సిఐటియు అనుబంధం) ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర మంగళవారం హైదరాబాద్‌కు చేరుకున్నది. ఈ సందర్భంగా సుందరయ్య విజ్ఞాన కేంద్రం నుంచి ఇందిరాపార్కు వరకు ప్రదర్శన చేపట్టారు. ఇందిరాపార్కు వద్ద వేలాది మందితో బహిరంగసభ నిర్వహించారు. సభలో ఎం సాయిబాబు మాట్లాడుతూ..స్వచ్ఛ భారత్ అంటూ మోడీ పొరకబట్టి ఊడ్చినట్టు, పారిశుధ్య కార్మికుల కాళ్లు కడిగినట్టు ఫొటోలకు ఫోజులిచ్చాడేగాని వారి జీవితాల బాగు కోసం ఒక్క నిర్ణయమైనా తీసుకున్నాడా? అని ప్రశ్నించారు. ప్రతి మనిషి రూ.100 పన్ను కడితే అందంతా కేంద్రానికి పోయి తిరిగి వెనక్కి రూ.మూడు మాత్రమే వస్తోందని, మిగతా డబ్బులన్నింటినీ కార్పొరేట్లకు మోడీ సర్కారు కట్టబెడుతోందని విమర్శించారు. సాటి మనుషులను గౌరవించలేనీ, మూడుపుటలా బువ్వ తినేలా జీతాలివ్వలేని పాలకులు ఎన్ని గుడులు కడితే ఏందీ? ఎన్ని పూజలు చేస్తే ఏందీ అని ప్రశ్నించారు. దేశంలో ప్రతి వంద మంది మహిళల్లో 50 మంది రక్తహీనతతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సామాన్యులకు వస్తున్న జబ్బులన్నీ పాలకుల విధానపరమైన లోపాలవల్లనేనని చెప్పారు. పారిశుధ్య కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు ఇస్తే ఆ కుటుంబం కాస్త పండ్లు, బలమైన పౌష్టికాహారం తీసుకునే వెసులుబాటు ఉంటుందనీ, ఫలితంగా ఆ కుటుంబంలో అనారోగ్యాలపాలయ్యే వారి సంఖ్య తక్కువగా ఉండే అవకాశం ఉంటుందని చెప్పారు. పది మంది కార్మికులు పనిచేస్తేనే పిఎఫ్ ఇవ్వాలని చట్టాలు చెబుతుంటే ..రాష్ట్రంలో 50 వేలమందికిపైగా పనిచేస్తున్న జిపి కార్మికులకు పిఎఫ్ ఎందుకివ్వరని ప్రశ్నించారు. కార్మికుల హక్కులను హరించే కార్మిక కోడ్లను కేంద్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బిజెపితో తాను చేసే యుద్ధంతో ప్రతిఒక్కరూ కలిసిరావాలనీ సిఎం కెసిఆర్ అంటున్నాడు సరే...జీతాల్లేకుండా, సరైన ఆహారం తీసుకోలేని స్థితిలో పంచాయతీ కార్మికులు ఎలా రాగలుగుతారని ప్రశ్నించారు. తక్షణమే వారిని పర్మినెంట్ చేసి కనీస వేతనం ఇస్తే వారికి బూస్ట్ ఇచ్చినట్టు అవుతుందనీ, మీరు చేసే యుద్ధంలో వారూ కలిసొస్తారని సీఎం కేసీఆర్‌కు సూచించారు. బంగారు తెలంగాణ కాదు కార్మికులకు బుక్కెడు బువ్వ పెట్టే తెలంగాణను నిర్మించాలని కోరారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు చుక్కరాములు మాట్లాడుతూ...ఆరేడు మంది పనిచేస్తే నలుగురికి జీతాలిచ్చి వాటినే పంచుకోవాలని చెప్పటం దుర్మార్గమని విమర్శించారు. మహనీయుల విగ్రహాలు పెడితే సరిపోదనీ, అట్టడుగు సామాజిక తరగతులకు చెందిన పంచాయతీ కార్మికులకు ఉద్యోగభద్రత కల్పించి జీవితాలు మెరుగుపర్చితేనే సామాజిక న్యాయం దక్కుతుందని అన్నారు. పంచాయతీ కార్మికులు చేస్తున్న పోరాటానికి ఎర్రజెండా ఎప్పుడూ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ... ఎర్రటెండలో కాళ్లకు బొగ్గలొచ్చినా...నీరసపడ్డా...ఆగకుండా నడిచింది మేమయితే...మమ్ముల్ని నడిపించింది ముమ్మాటికీ పంచాయతీ కార్మికులేనని నొక్కి చెప్పారు. ఏడెనిమిది నెలల నుంచి జీతాలివ్వకుంటే పంచాయతీ కార్మికులు ఎలా బతుకుతారని రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాష్ట్రంలో 12,700 జీతం పంచాయతీ కార్మికులకు ఎక్కడ ఇస్తున్నారో చూపెట్టాలని మంత్రి ఎర్రబెల్లికి సవాల్ విసిరారు. ఇచ్చే రూ.8,500 జీతాన్ని ఇద్దరు, ముగ్గురు కార్మికులను పంచుకోవాలని చెబుతున్నంది వాస్తవం కాదా? అని నిలదీశారు. సిఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలకు ఇస్తున్నట్టుగా లక్షలకు లక్షల జీతం అవసరం లేదనీ, పంచాయతీ కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు అడుగుతున్నామని చెప్పారు. ఇలా అడగటం కూడా నేరమేనన్నట్టుగా పాలకులు చూడటం దారుణమని పేర్కొన్నారు. కార్మికులకు భారంగా మారిన, చావులకు కారణమవుతున్న మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రమాదంలో ఓ పంచాయతీ కార్మికుడు కాలు పోగొట్టుకుని వైద్యం కోసం ఏడు లక్షలు ఖర్చు చేస్తే సర్కారు నయా పైసా సాయం చేయని తీరును ఎండగట్టారు. కార్మికులకు రూ.పది లక్షల ఇన్సూరెన్స్ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల నోటిఫికేషన్ లోపే పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలనీ, లేనిపక్షంలో పంచాయతీ కార్మికులు తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. అన్ని కార్మిక సంఘాలను కలుపుకుని ఐక్య పోరాటం చేస్తామని ప్రకటించారు.

ఈ సభకు పాదయాత్ర బృంద సభ్యుడు, తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయిస్, వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు గ్యార పాండు అధ్యక్షత వహించారు. ఈ సభలో పాదయాత్ర బృంద సభ్యులు, ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చాగంటి వెంకటయ్య, ఇతర బృంద సభ్యులు గణపతిరెడ్డి, వినోద్, మహేశ్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పి సుధాకర్, యాత్ర కో-ఆర్డినేటర్ జె వెంకటేశ్, సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు భూపాల్, పి జయలక్ష్మి, జె మల్లిఖార్జున్, కె ఈశ్వర్‌రావు, బి మధు, రాష్ట్ర కార్యదర్శులు పి.శ్రీకాంత్, కె.రమేశ్, టీయూ సోషల్‌మీడియా ఇన్‌చార్జి యాటల సోమన్న తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా రాకేశ్ మాస్టార్

పాదయాత్ర ముగింపు సభకు ప్రముఖ డ్యాన్స్‌మాస్టర్ రాకేశ్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. గాయకులు ఆనంద్, చంద్రమౌళి నేతృత్వంలో ప్రజానాట్యమండలి కళాకారులు పాడిన..'కార్మికులకు అండగా సిఐటియు జెండా..' పాటకు రాకేశ్ మాస్టర్ స్టెప్పులు వేసి అలరించారు. తన పదునైన వాగ్ధాటితో 'పదండి ముందుకు పదండి ముందుకు పంచాయతీ కార్మికులరా పదండి ముందుకు' అంటూ ఉత్తేజపర్చారు. గుక్కతిప్పుకోకుండా రైతులు, కార్మికుల శ్రమ విడమర్చి చెప్పడంతో అందరూ ఫిదా అయిపోయారు. సభాప్రాంగణం చప్పట్లతో మారుమోగిపోయింది.

వెంకటరాజు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నవతెలంగాణ ఎడిటర్

పద్మరాజు కుటుంబానికి నవతెలంగాణ ఎడిటర్ సుధాభాస్కర్ పరామర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్ మండలం శ్రీనివాసాపురంలో ఆదివారం రాత్రి గుండెపోటుతో సిపిఎం మండల నాయకులు, నవతెలంగాణ స్టేట్ బ్యూరో ఇన్‌చార్జి బివిఎన్ పద్మరాజు తండ్రి బొల్లేపల్లి వెంకటరాజు మృతిచెందిన విషయం విదితమే. కాగా, మంగళవారం వెంకటరాజు కుటుంబాన్ని నవతెలంగాణ దినపత్రిక సంపాదకులు ఆర్ సుధాభాస్కర్ పరామర్శించారు. వెంకటరాజు చిత్రపటానికి పూలమాలలేసి నివాళులర్పించారు. కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. పద్మరాజును, ఆయన తల్లి అనసూర్యమ్మను, తమ్ముడు సీతరామరాజు, కుటుంబ సభ్యులను ఓదార్చారు. పద్మరాజు కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నివాళులర్పించిన వారిలో నవతెలంగాణ న్యూస్ ఎడిటర్ రాంపల్లి రమేశ్, బుక్‌హౌస్ ఎడిటర్ కె ఆనందాచారి, బోర్డు సభ్యులు అనంతోజు మోహన్‌కృష్ణ, మాజీ సర్పంచ్ తంగేళ్ల వెంకటచంద్ర, గోపరాజు, పారుపల్లి శ్రీనివాస్‌రావు, కృష్ణమూర్తి, పారుపల్లి శ్రీను తదితరులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం

- 53 ఏళ్ల తర్వాత కలయిక • సంతోషం వ్యక్తం చేసిన గుత్తా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

నల్లగొండ జిల్లా చిట్యాల పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1969-70లో పదో తరగతి పూర్తి చేసుకున్న పూర్వ విద్యార్థులు మంగళవారం ఉరుమడ్ల గ్రామంలోని శాసనమండలి ఛైర్మెన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి స్వగృహంలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. గుత్తా సుఖేందర్‌రెడ్డి తన మిత్రులతో కలిసి సందడి చేశారు. మిత్రులతో కలిసి విద్యార్థి దశ అనుభవాలను, జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. ఈ సందర్భంగా వారికి విద్యను నేర్పించిన గురువులను ఘనంగా సన్మానించారు. అలాగే, తమ బ్యాచ్‌కు చెందిన ముగ్గురు మిత్రులు మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులకు రూ.25 వేల చొప్పున సహాయం అందజేశారు. శాసన మండలి ఛైర్మెన్ హోదాలో బిజీగా ఉన్నా తమలో ఒకరిగా కలిసిపోయి పేరుపేరునా అందరి యోగక్షేమాలను అడిగి తెలుసుకోవడంతో గుత్తా సుఖేందర్ రెడ్డి సహచరులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆనాటి ప్రధానోపాధ్యాయులు ఎ.అంజిరెడ్డి, ఉపాధ్యాయులు జయారపు కృష్ణయ్య, అంజయ్య, పూర్వ విద్యార్థులు శీలా రాజయ్య, వెలుపెల్లి శంకరయ్య, నాంపెల్లి జనార్ధన్, పంతంగి రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తెలుగు సినిమాను జాతీయ స్థాయిలో నిలిపిన విశ్వనాధ్

ప్రజాశక్తి- కల్చరల్

శంకరా భరణం, స్వాతి ముత్యం, సాగర సంగమం వంటి చిత్రాలకు దర్శకత్వం వహించి తెలుగు సినిమాను జాతీయ స్థాయిలో విశ్వనాధ్ నిలిపారని రాష్ట్ర జలవనరుల అభివృద్ధి సంస్థ ఛైర్మన్ డాక్టర్ సముద్రాల వెనుగోపాలాచారి నివాళులర్పించారు. రవీంద్రభారతి ప్రధాన వేదికపై ప్రగ్నిక ఫౌండేషన్, ప్రగ్నిక ఆర్ట్స్ అకాడమీ, కెవిఎల్ ఫౌండేషన్, సెల్వెల్ కార్పొరేషన్ సంయుక్త నిర్వహణలో ఇటీవల మరణించిన సినీ ప్రముఖులు జమున, వాణీ జయరాం, క్రిష్ణ, కృష్ణంరాజుల సంస్మరణగా వారి చిత్రాలలోని గీతలను ప్రవీణ్, విఠల్, సురేష్, సింహ, దేవాంషు, మెహరూన్ బీ తదితరులు మధురంగా అలపించారు. ప్రముఖ గాయని సురేఖ మూర్తి ప్రవీణ్‌లు యుగళ గీతలు పాడి శ్రోతల ప్రశంస పొందారు. అనంతరం జరిగిన సభా కార్యక్రమంలో ముఖ్య అతిధిగా డాక్టర్ వేణు గోపాలాచారి పాల్గొని యువదర్శకుడు వంశీ చాంగంటిని యువ ప్రతిభా పురస్కరంతో గాయని సురేఖను ప్రతిభా పురస్కరంతో సత్కారం చేశారు. ఆయన మాట్లాడుతూ విశ్వనాధ్ ప్రతి ఒక్కరూ సినిమా నేటి దర్శకులకు ఒక విజ్ఞానదాయక పాఠమన్నారు. వేదిక పై బందయ్య గౌడ్, గోపాలాచారి,శరత్ బాబు, హంస రాజ్, సీటీ కల్చరల్ సెంటర్ పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు ప్రవీణ్ స్వాగతం పలుకగా కార్యదర్శి పారిజాత వందన సమర్పణ చేశారు

హరిహరకృష్ణను కస్టడీకి ఇవ్వండి

- రంగారెడ్డి జిల్లా కోర్టులో పోలీసులు పిటిషన్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిటెక్ విద్యార్థి నవీన్ హత్య కేసులో నిందితుడిగా ఉన్న హరిహరకృష్ణను ఎనిమిది రోజుల కస్టడీకి ఇవ్వాలని పోలీసులు మంగళవారం రంగారెడ్డి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై విచారణను కోర్టు బుధవారానికి వాయిదా వేసింది. నవీన్ హత్యకు సంబంధించి నేర ఘటనా స్థలాన్ని మరోసారి నిందితుడితో కలిసి పరిశీలించాల్సి ఉందని, ఈ హత్య వెనుక ఇంకెవరైనా ఉన్నారా? అనే కోణంలో దర్యాప్తు చేయాల్సి ఉందని పోలీసులు దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌లో పేర్కొన్నారు. నవీన్ మొబైల్ ఫోన్‌ను ధ్వంసం చేసిన హరిహరకృష్ణ దాన్ని బాహ్యావలయ రహదారి పక్కన ఉన్న పొదల్లో పడేశాడని, అది ఎక్కడ ఉందో తెలుసుకోవాల్సి ఉందని పోలీసులు తెలిపారు. హరిహరకృష్ణ ఫోన్ సైతం స్వాధీనం చేసుకోవాల్సి ఉందని, ఆ ఫోన్‌ను ఎక్కడ దాచాడనే విషయాన్ని హరిహరకృష్ణను అడిగి తెలుసుకోవాల్సి ఉందని పోలీసులు పిటిషన్‌లో పేర్కొన్నారు. కస్టడీ పిటిషన్‌పై బుధవారం వాదనలు ముగిసిన తర్వాత కోర్టు నిర్ణయం తీసుకునే అవకాశముంది.

హసన్‌ను విచారించిన పోలీసులు..

నవీన్‌ను హత్య చేసిన తర్వాత హరిహరకృష్ణ నేరుగా తన స్నేహితుడు హసన్ ఇంటికి వెళ్లినట్టు చెప్పడంతో అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు హసన్‌ను పిలిచి ప్రశ్నించారు. హత్య జరిగిన తర్వాత చోటుచేసుకున్న సంఘటనల గురించి పోలీసులు.. హసన్‌ను అడిగి తెలుసుకున్నారు. బ్రాహ్మణపల్లిలోని రాజీవ్ గృహకల్పలో నివాసం ఉండే హసన్ ఇంటికి హరిహరకృష్ణ వెళ్లాడు. రక్తపు మరకలు అంటిన దుస్తులను విప్పేసి హసన్ దుస్తులు వేసుకున్నాడు. రక్తపు మరకల గురించి ప్రశ్నించగా.. నవీన్‌ను హత్య చేసినట్టు హరిహరకృష్ణ చెప్పినట్టు హసన్ పోలీసులకు వివరించాడు. ఎందుకిలా చేశావని ప్రశ్నించగా.. తన ప్రేమకు అడ్డురావడంతోనే హత్య చేసినట్టు హరిహర చెప్పాడని పోలీసులకు తెలిపాడు. 25న హసన్‌ను పిఎస్‌కు పిలిపించి ప్రశ్నించిన పోలీసులు ఆ తర్వాత అతనికి ఎలాంటి సంబంధం లేదని తేల్చి ఇంటికి పంపించేశారు. హరిహరకృష్ణ, హసన్ ఇంటర్మీడియెట్‌లో స్నేహితులని పోలీసులు వెల్లడించారు.

ప్రీతి మృతిపై దర్యాప్తు చేయండి

- కాళోజీ యూనివర్సిటీకి గవర్నర్ లేఖ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పిజి వైద్య విద్యార్థిని ప్రీతి మృతిపై సమగ్ర దర్యాప్తు జరిపి, నివేదిక ఇవ్వాలని గవర్నర్ తమిళసై సౌందరరాజన్ కాళోజీ విశ్వవిద్యాలయానికి లేఖ రాసారు. యూనివర్సిటీలో విద్యార్థులకు సంబంధించి ర్యాగింగ్, వేధింపులు జరిగినపుడు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే వివరాలూ పంపాలని కోరారు. మెడికోలు, అసిస్టెంట్ ప్రొఫెసర్ల పనిగంటలు, వైద్యకళాశాలలు, ఆస్పత్రుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరుపైనా నివేదిక ఇవ్వాలని ఆదేశించారు. ప్రీతిని నిమ్స్‌కు అత్యంత కీలకమైన సమయంలో తరలించారనీ, ఆమెకు వరంగల్ ఎంజీఎంలోనే సకాలంలో సరైన వైద్యం, దానికి అవసరమైన వైద్య నిపుణులు, అత్యాధునిక పరికరాలను తరలించి ఉండి ఉంటే బాగుండేదని అభిప్రాయపడింది.

కామారెడ్డి జిల్లాలో నేడు సిఎం పర్యటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖరరావు బుధవారం కామారెడ్డి జిల్లాలో పర్యటించనున్నారు. తెలంగాణ తిరుమలగా ప్రసిద్ధిగాంచిన బాన్సువాడ నియోజకవర్గం బీర్కూర్ మండలం తిమ్మాపూర్ వేంకటేశ్వరస్వామి కల్యాణ వేడుకల్లో పాల్గొననున్నారు. ఉదయం బేగంపేట నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరి బాన్సువాడ పట్టణంలో ఏర్పాటు చేసిన హెలీప్యాడ్‌కు 10.40 గంటలకు చేరుకుంటారు. అనంతరం అక్కడి నుంచి కాన్వాయ్‌లో 10.55 గంటలకు తిమ్మాపూర్‌లోని తిరుమల వేంకటేశ్వర ఆలయానికి చేరుకుంటారు. శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో సిఎం స్వయంగా పాల్గొంటారు. అనంతరం అక్కడే ఏర్పాటు చేసిన కృతజ్ఞత సభకు హాజరవుతారు. బ్రహ్మోత్సవంలో పాల్గొన్న అనంతరం బాన్సువాడ నుంచి బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకుంటారని సిఎంఒ మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. సిఎం పర్యటన నేపథ్యంలో బాన్సువాడ పట్టణంతోపాటు ఆలయ ప్రాంగణం, పరిసర ప్రాంతాలను సిఎం ప్రత్యేక వ్యక్తిగత రక్షణ బందం, డాగ్ స్క్వాడ్ బృందాలు తనిఖీలు నిర్వహించారు. కృతజ్ఞత సభ కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు వేదికను సిద్ధం చేస్తున్నారు. సభకు హాజరయ్యే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.

కాంగ్రెస్, బిఆర్ఎస్ మధ్య ఫ్లెక్సీ, కటౌట్ల వార్

- కొట్టుకున్న ఇరు గ్రూపుల నాయకులు పోలీసుల లాఠీచార్జి
- టవరెక్కి నిరసన తెలిపిన కాంగ్రెస్ యువజన నాయకుడు సాగర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్ జిల్లా కేంద్రంలో ఉద్రిక్తత వాతావరణం నెలకొంది. ఫ్లెక్సీ, కటౌట్లు ఏర్పాటు చేసే విషయంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు కొట్టుకున్నారు. పోలీసులు లాఠీచార్జి చేయడంతో గొడవ కాస్త సద్దుమణిగింది. పూర్తి వివరాల్లోకి వెళితే..

పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా భూపాలపల్లి పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేస్తుండగా బిఆర్ఎస్ కార్యకర్తలు అడ్డుకున్నారు. నాలుగు రోజుల కింద భూపాలపల్లికి కెటిఆర్ వస్తే బిఆర్ఎస్ నాయకులు పెద్దఎత్తున ఫ్లెక్సీలు, కటౌట్లు కట్టారు. ఇప్పుడు అదే స్థలంలో కాంగ్రెస్ నాయకులు రేవంత్ ఫ్లెక్సీలు కట్టడానికి ప్రయత్నించగా బిఆర్ఎస్ నాయకులు అడ్డుపడ్డారు. దీంతో రెండు పార్టీల నాయకుల మధ్య మాటల యుద్ధం, తోపులాట జరిగింది. ఆ తర్వాత నినాదాలు చేసుకుంటూ కొట్టుకున్నారు. దీంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. సిఐ రాజిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు లాఠీచార్జి చేసి ఇరు గ్రూపులను చెదరగొట్టారు. ఎలక్ట్రానిక్ మీడియా కెమెరామెన్‌తోపాటు పలువురికి గాయాలయ్యాయి. సుమారు మూడు గంటలపాటు అంబేద్కర్ సెంటర్లో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. టిఆర్ఎస్ నాయకులు కెటిఆర్ ఫ్లెక్సీకి అడ్డుగా రేవంత్ ఫ్లెక్సీ ఏర్పాటు చేయకూడదని పట్టుబట్టారు. కెటిఆర్ పర్యలన ముగిసి ఆరు రోజులైనా ఫ్లెక్సీలు ఎందుకు తొలగించలేదని, తాము ఇక్కడ రేవంత్ ఫ్లెక్సీలు పెట్టుకుంటామని కాంగ్రెస్ నాయకులు జాతీయ రహదారిపై నిరసన వ్యక్తం చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న డిఎస్పి ఎ రాములు ఇరు పార్టీల నేతలతో మాట్లాడి సముదాయించారు. దాంతో కాంగ్రెస్ ఏర్పాటు చేసిన రేవంత్ కటౌట్‌ను కొంచెం ముందుకు జరిపి పెట్టారు.

ఫ్లెక్సీ వద్ద కొట్టుకుంటున్న కాంగ్రెస్, బిఆర్ఎస్ నాయకులు

సెల్ టవర్ ఎక్కి నిరసన..

బిఆర్ఎస్ నాయకులకు వ్యతిరేకంగా కాంగ్రెస్ యువజన నాయకుడు ఎస్‌పికె సాగర్ పక్కనే ఉన్న సెల్ టవర్ ఎక్కి నిరసన వ్యక్తం చేశారు. ఆత్మహత్య చేసుకుంటానంటూ హల్‌చల్ చేశారు. సిఐ రాజిరెడ్డి ఫోన్లో మాట్లాడి సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నామని, వెంటనే దిగిరావాలని కోరడంతో కిందికి వచ్చాడు.

బిజెపి, బిఆర్ఎస్ అవిభక్త కవలలు

- బొగ్గు బ్లాక్‌లను బంధువులకు కట్టబెట్టుకున్నారు
- పిసిసి అధ్యక్షులు రేవంత్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

"బిజెపి, బిఆర్ఎస్ అవిభక్త కవలలు.. కాంగ్రెస్‌కు అధికారం కొత్తేమీ కాదు.. తెలంగాణ రాష్ట్రం ఇచ్చిన సోనియా గాంధీకి కృతజ్ఞతగా మరొక్కసారి ప్రజలు అధికారం ఇస్తే అసలైన తెలంగాణ ఏంటో చూపిస్తాం.." అని పిసిసి అధ్యక్షులు ఎనమల రేవంత్ రెడ్డి అన్నారు. కాంగ్రెస్ హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా మంగళవారం జయశంకర్ జిల్లా కేంద్రంలోని భూపాలపల్లి ఏరియా కేటికె-5 గనిలో ఐఎన్‌టియుసి భూపాలపల్లి బ్రాంచ్ ఉపాధ్యక్షులు జోగ బుచ్చయ్య అధ్యక్షతన గేట్‌మీటింగ్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో సింగరేణి, ఆర్‌టిసి, విద్యుత్ కార్మికులు పాల్గొని సకలజనుల సమ్మె చేస్తేనే రాష్ట్రం వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు సమ్మెను చూసి స్పందించి ఢిల్లీ పార్లమెంట్‌లో రాష్ట్ర ఏర్పాటు బిల్లు ప్రవేశపెట్టారని చెప్పారు. తద్వారా ఆంధ్రప్రదేశ్‌లో కాంగ్రెస్ నామరూపాలు లేకుండా పోయిందని, కేంద్రంలో అధికారం కోల్పోయిందని, ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన తెలంగాణ కెసిఆర్ పాలైందని అన్నారు. తొమ్మిదేళ్లుగా కేసీఆర్ కుటుంబం ప్రజలను దోచుకుంటూ కోట్లు కొల్లగొడుతోందని ఆరోపించారు. బిఆర్ఎస్ అధికారంలో ఉండి.. టిబిజికెఎస్ సంఘానికి గౌరవాధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత, ఆర్‌టిసి సంఘానికి గౌరవ అధ్యక్షుడు హరీశ్‌రావు అయి ఉండి కూడా కార్మిక సమస్యలు ఎందుకు పరిష్కారం కావట్లేదో కార్మికులు ఆలోచించాలన్నారు. ప్రజలు, కార్మికులు కాంగ్రెస్ వైపు చూస్తున్నారన్నారు. సమస్యలు చెబితే సరిపోదని, పెన్ను, పేపరు, అధికారం ఇస్తే.. కొట్లాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రాన్ని బతికించుకుందామని చెప్పారు. రాష్ట్రంలో సిఎంను, మంత్రిని, ఎమ్మెల్యేను కలిసే పరిస్థితులు లేవని, కాంగ్రెస్ హయాంలో సామాన్య పౌరుడు ఎవరిని కలవాలన్నా సులభతరంగా ఉండేదని వివరించారు. మోడీ, కెసిఆర్ ఒకే తల, రెండు దేహాలు కలిగి ఉన్నారని, పైపైకి మాత్రమే ప్రయివేటీకరణ, రైతు చట్టాలు తదితర అంశాలపై పోరాడినట్టు కెసిఆర్ నటిస్తున్నారని విమర్శించారు. ప్రయివేటీకరణకు వ్యతిరేకం అంటూనే.. తాడిచర్ల బొగ్గు బ్లాక్‌ను తన బంధువు ప్రతిమ శ్రీనివాస్‌కు, కోయగూడెం ఒసి అరబిందో ఫార్మాకు కట్టబెట్టిండని.. దాంట్లో వారి వాటా ఎంతో చెప్పాలని ప్రశ్నించారు. మంథని ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు మాట్లాడుతూ.. రాహుల్‌గాంధీ 4000 కిలోమీటర్ల పాదయాత్ర చేస్తూ అనేక రాష్ట్రాలలో కార్మికుల సమస్యలను విని ఐఎన్‌టియుసి దృష్టికి తెచ్చారన్నారు. కాంగ్రెస్‌కు అధికారం ఇస్తే కార్మిక శ్రేయస్సుకు కట్టుబడి పని చేస్తామని, గతంలో సింగరేణి లాభాల్లో కార్మికులకు వాటా ఇచ్చిన ఘన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని గుర్తు చేశారు. సింగరేణి కార్మికులకు ఇన్‌కం టాక్స్ రద్దు చేస్తామని మోడీ హామీ ఇచ్చారు. కార్మికుల కష్టంతో లాభాలు వస్తే నిధులు తీసుకెళ్లి సిరిసిల్ల, సిద్దిపేట, గజ్వేల్, పాలకుర్తిలో ఎందుకు ఖర్చు పెడుతున్నారని నిలదీశారు. భూపాలపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి గండ్ర సత్యనారాయణరావు మాట్లాడుతూ.. లాభాలలో ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం అదానీ, అంబానీలకు దోచిపెట్టడమే పరమావధిగా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పని చేస్తున్నాయని ఆరోపించారు. ఈ ప్రభుత్వాలతో ప్రజలు విసుగెత్తారని, ఏ ఎన్నికలు వచ్చినా కాంగ్రెస్ గెలుపొందడం ఖాయమని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపి సిరిసిల్ల రాజయ్య, ఐఎన్‌టియుసి సెక్రటరీ జనరల్ జనక్ ప్రసాద్, భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి అయిత ప్రకాష్‌రెడ్డి, నాయకులు మధుకర్‌రెడ్డి, రఘుపతిరెడ్డి, పొనగంటి కృష్ణ, వేణుగోపాల్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



గేట్‌మీట్‌ంగ్‌లో మాట్లాడుతున్న రేవంత్ రెడ్డి

కుక్కల దాడిలో మృతి చెందిన బాలుని కుటుంబానికి రూ.పది లక్షల పరిహారం

- ప్రకటించిన జిహెచ్‌ఎంసి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్‌లోని అంబర్‌పేటలో కుక్కల దాడిలో మృతి చెందిన బాలుడు ప్రదీప్ కుటుంబానికి

జిహెచ్‌ఎంసి పరిహారం ప్రకటించింది. జిహెచ్‌ఎంసి రూ.ఎనిమిది లక్షలు, కార్పొరేటర్ల నెల జీతం నుంచి రూ.రెండు లక్షలు కలిపి మొత్తం రూ.10లక్షల పరిహారం ఇవ్వాలని బల్దియా నిర్ణయించింది. ప్రదీప్ మృతి చెందిన ఘటనను హైకోర్టు ఇప్పటికే సుమోటో పిటిషన్‌గా స్వీకరించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్, జస్టిస్ ఎన్ తుకారాంజీలతో కూడిన ధర్మాసనం విచారణ చేపట్టింది.

ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, జిహెచ్‌ఎంసి కమిషనర్, హైదరాబాద్ కలెక్టర్, లీగల్ సర్వీసెస్ అథారిటీ సభ్యకార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. కుక్కలు వీధుల్లో తిరగకుండా ఏం చర్యలు తీసుకుంటున్నారో కార్యాచరణ ప్రణాళిక సమర్పించాలని ఆదేశించింది. కుక్కల దాడిలో మృతి చెందిన ఘటన పరిహారానికి అర్హమైన కేసు అని, బాలుడి తల్లిదండ్రులకు పరిహారం అంశాన్ని వచ్చే విచారణలో పరిశీలిస్తామంటూ విచారణను ధర్మాసనం మార్చి 16వ తేదీకి వాయిదా వేసింది. ఈలోగానే బల్దియా అధికారులు పరిహారం అందజేతపై నిర్ణయం తీసుకున్నారు.